క్లుప్తంగా

మొగిలిలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామక్షమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజ కార్యక్రమాలు చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని దోష నివారణ చేసుకున్నారు. కార్యక్రమంలో ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి



గుడిపాల: రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. మండలంలోని పానాటూరు హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో సోమవారం ఆమె తమ సిబ్బందితో కలిసి రోగులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల ఇంటివద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. వేసవిలో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

పూతలపట్టు(యాదమరి): పూతలపట్టు మండలంలో పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ శ్రీకారం చుట్టారు. సోమవారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పి.కొత్తకోటలో పర్యటించారు. అనంతరం పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, కొన్నింటికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న బొలెరో

పుంగనూరు: మండలంలోని చిన్నారికుంట మలుపు వద్ద సోమవారం కారును బొలేరో వాహనం ఢీకొంది. దీంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. బొలేరొ వాహనం పలమనేరు నుంచి పుంగనూరు వస్తోంది. అదే సమయంలో కారు పుంగనూరు నుంచి పలమనేరు వైపు వెళుతోంది. చిన్నారికుంట మలుపు వద్ద బొలేరొ వాహనం కారును ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న భాగ్యవతి (32) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆమెను 108లో పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారి వివరాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా స్నపన తిరుమంజనం

పుంగనూరు: పట్టణంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం శ్రీవారికి స్నపన తిరుమంజనాన్ని వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా స్వామివారికి పాలు, పెరుగు, కొబ్బరి నీళ్లు, తేనె, పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులను మండపంలో కొలువుదీర్చి తులసిమాలలతో అలంకరించారు.

ఎఫ్ఆర్ఎస్‌తో ముప్పతిప్పలు

అంగన్‌వాడీ కార్యకర్తలు యాప్‌లతో సతమతమవుతున్నారు. లబ్ధిదారులకు పోషణ ట్రాకర్, బాలసంజీవిని అందించాలంటే నాలుగు యాప్‌లో నిర్వహించాలి. లబ్ధిదారుల ఫేస్ రికగ్నైజ్ చేసి యాప్‌లో నమోదు చేయాలి. అయితే ఇక్కడే పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ గుర్తింపు చాలా సార్లు సక్సెస్ కావడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు.

- బాలింతలు, గర్భిణుల గుర్తింపునకు సరిగా పని చేయని యాప్‌లు
- పోషణ ట్రాకర్ ద్వారానే సరుకులు ఇవ్వాలని కేంద్రం నిబంధన
- అవస్థల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు
- పౌష్టికాహారం పంపిణీ అస్తవ్యస్తం
- పట్టించుకోని ప్రభుత్వం



ఐరాల: పాతపాళ్యం అంగన్‌వాడీ సెంటర్ నిరసన తెలుపుతున్న మూడు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం)/ఐరాల: ప్రభుత్వం బాలసంజీవిని ద్వారా లబ్ధిదారులకు ముఖం గుర్తింపుతో బియ్యం ఇస్తున్నారు. అయితే ఇప్పుడు తాజాగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోషణ ట్రాకర్ ద్వారానే లబ్ధిదారులను గుర్తించి సరుకులు ఇవ్వాలనే నిబంధనను తప్పనిసరి చేయడంతో కార్యకర్తలు రెండు యాప్‌లు నిర్వహించాల్సి వస్తోందని, తమకు ఇది కష్టంగా ఉందని వాపోతున్నారు. ఆ యాప్‌ల గురించి ముందుగా శిక్షణ ఇప్పిస్తే ఫలితం ఉంటుంది. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు 6 నెలల నుంచి 3 సంవత్సరాల బాలలకు ప్రతి నెల పోషకాహారాన్ని ఇంటికే అందిస్తున్నారు. గతంలో లబ్ధిదారులకు అంగన్‌వాడీ కేంద్రాల వద్దే పోషకాహారం ఇచ్చేవారు. అయితే ఎక్కువమంది తమకు ఇంటి వద్దకే పోషకాహారం కావాలంటూ ప్రభుత్వాన్ని అభ్యర్థించడంతో పాటు టీహెచ్ఆర్ మార్చి పాలు, కోడిగుడ్లు, నూనె, పప్పు దినుసులు, బియ్యం వంటివి ప్రతినెలా రెండు దఫాలుగా అందిస్తున్నారు. నెలలో ఎక్కువ సమయం ఈ పనికే వినియోగించడం వల్ల చిన్నారుల ప్రాథమిక విద్యకు ఇబ్బందికరంగా మారిందని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండుసార్లు నమోదు కష్టమైంది

గర్భిణులు, బాలింతలతో కార్యకర్తలు పాటు 6 నెలల నుంచి 3 సంవత్సరాలు కలిగిన చిన్నారుల పూర్తి వివరాలను పోషణ యాప్ ద్వారా రెండుసార్లు నమోదు చేయాల్సి వస్తోందని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. అదేవిధంగా టీహెచ్ఆర్ (టేక్ హోమ్ రేషన్) అందించాలంటే ఒకే వ్యక్తిని రెండుసార్లు ముఖ యాప్ ద్వారా గుర్తించాల్సి రావడం కూడా ఇబ్బందికరంగా మారిందంటున్నారు.

ప్రాథమిక విద్యకు ఇబ్బందులు

అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల్లో 15 రకాల రికార్డులు నిర్వహించాల్సి వస్తోంది. దీని వల్ల చిన్నారుల ప్రాథమిక విద్యకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోతున్నారు. ఇందులో లబ్ధిదారులకు అందించే ఆహార వినియోగం (ఎఫ్‌సీఆర్), పిల్లలు, గర్భిణులు, బాలింతలకు నమోదు చేసే రికార్డులు (ఎస్ఎన్‌జీ), ప్రీస్కూల్ అడ్మిన్ రికార్డులను ప్రతి నిత్యం విధిగా నమోదు చేయాల్సి ఉంటుంది. వాటితో పాటుగా పిల్లలకు అందించే టీకాలకు సంబంధించిన రికార్డుల రిజిస్టర్, విటమిన్-ఏ రికార్డు, రెఫరల్ సర్వీసెస్ గృహ సందర్శకుల రికార్డులు నిర్వహించాలి. దీంతో పాటు నెలవారీ ప్రాజెక్టు (ఎంటీఆర్), ఆయా అంగన్‌వాడీల పరిధిలోని హౌస్ హోల్డ్ సర్వే, గ్రోత్ రికార్డు, గ్రోత్ చార్ట్‌తో పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన రెండు టేక్ హోమ్ రేషన్ పంపిణీ రికార్డు, స్టాఫ్ అడ్మిన్ రిజిస్టర్ నిర్వహించాల్సి వస్తోందంటున్నారు.

ఐరాలలో భారీ నిరసన

గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు ఎఫ్ఆర్ఎస్(ఫేస్ యాప్) రద్దు చేసి, ప్రీస్కూల్ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని ఐరాల, తవణంపల్లె, పూతలపట్టు మండలాల అంగన్‌వాడీ కేంద్రాల యూనియన్ లీడర్ జమున డిమాండ్ చేశారు. సోమవారం ఐరాల మండలం పాతపాళ్యం సీడీపీఓ కార్యాలయం వద్ద ఆమె మూడు మండలాల కార్యకర్తలతో కలిసి నిరసన చేపట్టారు. తమకు 2022లో ఫోన్లు ఇచ్చారని, 90 శాతం ఫోన్లు పని చేయడం లేదని చెప్పారు. వెంటనే ఈ యాప్‌లు రద్దు చేసి పాత పద్ధతిలో లబ్ధిదారులకు సరుకులు అందజేయాలని డిమాండ్ చేశారు.

చిత్తూరు ప్రాజెక్టు పరిధిలో వివరాలు

చిత్తూరు ప్రాజెక్టులోని ప్రాంతాలు	:	చిత్తూరు అర్బన్, రూరల్, గుడిపాల
అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య	:	227
మొత్తం జనాభా	:	184284
పురుషులు	:	91719
స్త్రీలు	:	92565
గర్భిణులు	:	1123
బాలింతలు	:	1059
0-6 వయస్సు పిల్లలు	:	9344

ఎల్లో మీడియా కట్టుకథ లిక్కర్ స్కాం

చిత్తూరు కార్పొరేషన్: సీఎం చంద్రబాబునాయుడు, ఎల్లోమీడియాతో కలిసి లిక్కర్ స్కాం కట్టుకథ అల్లారని వైఎస్సార్‌సీపీ మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంవత్సర కాలంగా వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రజాపోరాటాలను చూసి ప్రభుత్వం భయపడుతోందన్నారు. వైఎస్సార్‌సీపీకి బలమైన ప్రాతినిథ్యం వహించే పెద్దిరెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలుగా అణగదొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు లిక్కర్ స్కాంకు సంబంధించిన ఎటువంటి ఆధారాలు లేకపోగా, ఒక్క రూపాయి కూడా సీజ్ చేసినట్లు వివరాలు లేవన్నారు. కేవలం కొందరు ఉద్యోగులను బెదిరించి వాంగ్మూలం తీసుకున్నారని, ఇలాంటి తప్పుడు కేసులు ఎన్ని పెట్టినా పెద్దిరెడ్డి కుటుంబానికి ఉన్న ఆదరణ తగ్గదన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వానికి ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెబుతారన్నారు.

లారీ బోల్తా



రహదారిపై బోల్తాపడిన లారీ

బంగారుపాళెం: మండలంలోని పాలమాకులపల్లె వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై సోమవారం లారీ బోల్తాపడింది. కోలార్ నుంచి విజయవాడకు కొత్తిమీర లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రహదారిపై బోల్తాపడిన లారీని పక్కకు తొలగించే చర్యలు చేపట్టారు.

కూటమి కనుసన్నల్లో ఖాకీలు

పూతలపట్టు(యాదమరి): కూటమి నేతల కనుసన్నల్లోనే ఖాకీలు పని చేస్తున్నారని పూతలపట్టు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గ నాయకులతో కలిసి మండల కేంద్రంలో నిరసన తెలిపేందుకు సిద్ధం అవగా.. స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ మండల పర్యటన ఉన్నందున అనుమతి లేదని పోలీసులు చెప్పడం ఎంతవరకు సమంజసమని అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేక నానాతంటాలు పడుతోందని.. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను దృష్టి మళ్లించేందుకే సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని ఎద్దేవా చేశారు. న్యాయాన్ని పరిరక్షించాల్సిన పోలీసువ్యవస్థ కూటమి నాయకులు చెప్పినట్లు నడుస్తున్నారని ఆరోపించారు. అనంతరం నిరసన కార్యక్రమాన్ని తవణంపల్లెలో నిర్వహించి జయప్రదం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, యువత అధ్యక్షుడు నవీన్, సర్పంచ్ నందన్న, వైస్ ఎంపీపీ ద్వారక నాగిరెడ్డి, నాయకులు అమర్నాథ్‌రెడ్డి, యతీష్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



మృతురాలు పద్మావతి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో రెగ్యులర్ పబ్లిక్ హెల్త్ కార్మికురాలుగా విధులు నిర్వహిస్తున్న పద్మావతి మృతికి నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, ఎంహెచ్ఓ పి.లోకేష్ నివాళులు అర్పించారు. జానకారపల్లి మస్టర్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పద్మావతి అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం చిత్తూరు కట్టమంచిలోని మృతురాలి నివాసానికి వెళ్లి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం తరఫున మట్టి ఖర్చుల కింద రూ.25 వేలు మృతురాలు కుమార్తెకు అందించారు. ప్రభుత్వం నుంచి అన్నివిధాలా ఆదుకుంటామని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, కార్మికులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 12 సమస్యలు వచ్చినట్లు నగర కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంఈ వెంకటరామిరెడ్డి, ఎంహెచ్ఓ డా.లోకేష్, ఏసీపీ నాగేంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా బీజేపీ నూతన కమిటీ

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర పార్టీ ఆదేశాల ప్రకారం జిల్లా బీజేపీ నూతన కమిటీ వివరాలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా అట్లూరి శ్రీనివాసులు, గౌనివారి విజయ్ కుమార్, మాదాసి లోకేశ్, జిల్లా ఉపాధ్యక్షులుగా కేవీ చంద్రమోహన్, మణిశర్మ, రమేష్‌నాయుడు, రవికుమార్, అరుణ, జి.కె.చౌదరి, జిల్లా కార్యదర్శులుగా సత్యభామ, జీఆర్ ప్రభాకర్, కె.బాబు, టి.జలజాక్షి, వెంకటరమణనాయుడు, జయచంద్రరెడ్డి, జిల్లా కోశాధికారిగా హరి నాయుడు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా రాజేష్, ఐటీ జిల్లా కన్వీనర్‌గా మాధురితో పాటు 17 మంది జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు.

దారి సమస్యను పరిష్కరించండి



వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ మోహన్

యాదమరి: ఇరువర్గాల మధ్య నెలకొన్న దారి సమస్యను పరిష్కరించి తగు చర్యలు తీసుకోవాలని ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్ స్థానిక తహసీల్దార్ పార్థసారథిని ఆదేశించారు. సోమవారం వరదరాజులపల్లి దళితవాడకు చెందిన డేవిడ్ భార్య శశిరేఖ అదే గ్రామానికి చెందిన మోహన్ మధ్య నెలకొన్న దారి సమస్యపై జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ట్రైనీ కలెక్టర్ దారి సమస్య ఉన్న బుడితిరెడ్డిపల్లికి వెళ్లి పరిశీలించారు. అయితే ఫిర్యాదుదారులు మాట్లాడుతూ చాలాకాలంగా తమ ఆధీనంలో ఉన్న భూమిలో పంటలు సాగు చేసుకుంటున్నామని అన్నారు. అయితే మోహన్ అనే వ్యక్తి తమ ఇటుకల బట్టీకి వాహనాల రాకపోకల కోసం కూటమి నాయకుల అండతో దౌర్జన్యంగా తమ భూభాగంలో దారి నిర్మించుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అనేకసార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదని వాపోయారు. ఈ విషయంపై న్యాయం చేయాలని భాదితురాలు ట్రైనీ కలెక్టర్‌కు మొర పెట్టుకున్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఆయన ఆదేశించారు.

విద్యార్థుల తలరాత మార్చేది విద్య



మొగిలిమిట్టూరులో విద్యార్థులకు ఉచిత నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: చదువులు విద్యార్థుల భవిష్యత్తును ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్తుందని ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని మొగిలిమిట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈశ్వర్ కళ్యాణ్ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలను పంపిణీ కార్యక్రమాన్ని హెచ్ఎం చంద్రిక అధ్యక్షతన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువు విలువ తెలుసుకుని కష్టపడి చదివితే భవిష్యత్ బంగారుబాటగా మలుచుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ స్కూళ్లలో అందుతున్న ఉచిత వసతులను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం దాతలు పంపిణీ చేసిన ఉచిత నోటు పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతారాముల ఆలయానికి మహర్దశ



తవణంపల్లె: మండలంలోని వెంగంపల్లెలో వెలసిన పురాతన సీతారాముల దేవస్థానానికి మహర్దశ వచ్చింది. పురాతన ఆలయాన్ని శిథిలావస్థకు చేరుకోవడంతో వెంగంపల్లె గ్రామస్తులు చిత్తూరు ఎండోమెంటు కమిషనర్‌కు నూతన ఆలయానికి నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. చిత్తూరు ఎండోమెంట్ కమిషనర్ వెంగంపల్లెలోని పురాతన సీతారాముల ఆలయాన్ని పరిశీలించి అంచనాలు వేసి రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపారు. దేవదాయశాఖ మంత్రి అనుమతితో ఎండోమెంట్ కమిషనర్ సీజీఎఫ్(కన్జర్వేషన్ గ్రాంట్ ఫండ్స్)స్కీం కింద ఆగమశాస్త్రం ప్రకారం నూతన సీతారాముల దేవస్థానం నిర్మించడానికి రూ.88 లక్షలు మంజూరు చేసింది. గ్రామస్తుల కాంట్రిబ్యూషన్ కింద రూ.22 లక్షలు నిధులు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గ్రామస్తులు రూ.22 లక్షలు నిధులు విరాళాలు చెల్లించడానికి ముందుకు వచ్చారు. వెంగపల్లెలో పురాతన ఆలయస్థానంలో నూతన గుడి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు ఎండోమెంట్ అధికారులకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో విధ్వంస పాలన



ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును ఖండిస్తూ చిత్తూరులో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



తవణంపల్లెలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్, పార్టీ నాయకులు

- ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం
- పెద్దిరెడ్డి కుటుంబంపై సీఎం చంద్రబాబు కుట్రలు
- తప్పుడు కేసులతో వైఎస్సార్‌సీపీని ఏమీ చేయలేరు
- ఉయ్ స్టాండ్ విత్ మిథున్‌రెడ్డి అని నినదించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ లోక్‌సభాపక్ష నేత, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా అరెస్టు చేసిందని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబానికి ప్రజల్లో ఉన్న ఆదరణను అణచివేయాలని సీఎం చంద్రబాబు చేస్తున్న కుట్రలు ఫలించవని.. భవిష్యత్‌లో మూల్యం చెల్లించక తప్పదన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలో ఎంపీ అరెస్టుపై నిరసన ర్యాలీలు చేపట్టారు.

ప్రజాదరణను ఓర్వలేక..



జగనన్న చుట్టూ ఉన్న వారిని జైలుకు పంపాలనే కుట్రపన్నారు. లేని కేసును ఉన్నట్లు అనుకూల మీడియాతో వార్తలు రాయిస్తున్నారు. ఎంతసేపూ తప్పుడు రాతలు, మాటలతో వైఎస్సార్‌సీపీ కేడర్‌ను దెబ్బతీసే విధంగా నడుచుకుంటున్నారు. మూడుసార్లు ఎంపీగా అత్యధిక మెజార్టీతో మిథున్‌రెడ్డి గెలిచారు. అందుకే వైఎస్సార్‌సీపీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను ఓర్వలేక ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారు. –గాయత్రీదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహిళ విభాగం

కక్షపూరిత రాజకీయాలు..



రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలు తారాస్థాయికి చేరాయి. గతంలో టీడీపీ పాలనలో గుడి, బడి చుట్టూ మద్యం దుకాణలు ఇష్టారాజ్యంగా పెట్టారు. ఆయన హయాంలో పలు మద్యం కంపెనీలకు అనుమతులు ఇచ్చి వాటాలు పంచుకున్నారు. జగనన్న పాలనలో నూతన మద్యం పాలసీని పెట్టి మద్యం దుకాణలను తగ్గించారు. ఇందులో స్కాం ఎక్కడ ఉంది ? అయితే స్కాం జరగకపోయినా పెద్దిరెడ్డి కుటుంబాన్ని సీఎం చంద్రబాబు టార్గెట్ చేశారు. –దాక్షాయణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహిళా విభాగం

లిక్కర్ స్కాం ఓ డ్రామా



లిక్కర్ స్కాం పేరిట ప్రభుత్వం డ్రామా ఆడుతోంది. జరగని విషయాలను జరిగినట్టు వాటి ఆధారాలు సేకరిస్తున్నట్లు హడావుడి చేస్తున్నారు. జరగని స్కాంలక్ష ఆధారాలు ఎలా సృష్టించాలో అర్థం కాక సిట్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అక్రమ కేసులతో వైఎస్సార్‌సీపీని అడ్డుకోవాలని చూడడం చంద్రబాబు, లోకేష్‌ల తెలివి తక్కువతనం. జగనన్నను, పెద్దిరెడ్డిని ఇబ్బంది పెట్టాలనే కక్ష కట్టి వ్యవహరిస్తున్నారు. ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలకు నిజం తెలుస్తుంది. –హేమంత్‌రెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్, యువజన విభాగం

కడిగిన ముత్యంలా వస్తారు..



మిథునన్న కడిగిన ముత్యంలా బయటకు వస్తారు. పథకం ప్రకారం ఎల్లో మీడియాలో మొదట ప్రచారం చేయడం.. తర్వాత వాటిపై విచారణ అనడం.. అందుకు అనుగుణంగా చార్జిషీట్‌లు వేయడం. అసలు రాష్ట్రాన్ని ఆ రెండు పత్రికలు పాలిస్తున్నాయా ? కూటమి ప్రభుత్వంలోని పాలకులు పాలిస్తున్నారో తెలియడం లేదు. 2014–19 పాలనలో జరిగిన రూ.25 వేల కోట్ల లిక్కర్‌స్కాంలో ప్రధాన సూత్రధారి చంద్రబాబే. కానీ ఇప్పుడు మద్యం స్కాం పేరిట చీప్ పాలిటిక్స్ చేస్తున్నారు. –హరీషా రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు మహిళ విభాగం